Since 2004

RNI No.Ap Tel 14145/2004a

# పిడికిలి

స్పెషల్ ఎడిషన్

The Peoples Paper

రిపోర్టర్‌లు కావలెను

గత 2004 సంవత్సరం నుంచి నిరాటంకంగా నడుస్తున్న పిడికిలి దినపత్రిక ఆన్‌లైన్ ఎడిషన్ దిన పత్రికకు తెలుగు రాష్ట్రాల్లోని మండలాలు, మున్సిపాలిటీ, నగర పంచాయతీలు, మున్సిపల్ డివిజన్ల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తిగలవారు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్

9866663153

సంపుటి : 019 సంచిక : 297 | శనివారం 25 - 04 - 2026 | చీఫ్ ఎడిటర్ : చామకూర రాజు | పేజీలు : 4 వెల : రూ. 5.00

## ఆర్టీసీ జేఏసీ నేతలతో
# మంత్రుల బృందం భేటీ

- లిఖితపూర్వక హామీకి జేఏసీ నేతల డిమాండ్
- సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, లక్ష్మణ్
- డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతిపట్ల సంతాపం తెలిపిన మంత్రులు, జేఏసీ నేతల సంతాపం
- 29 అంశాలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపిన మంత్రులు
- శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం, ఉద్యోగం ఇస్తామన్న పొన్నం



**హైదరాబాద్ :**

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల డిమాండ్ల పరిష్కారంలో భాగంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ వికాస్‌రాజ్‌లు హాజరయ్యారు. డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై మంత్రులు ఆర్టీసీ జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. అనంతరం జేఏసీ నేతల డిమాండ్లపై చర్చిస్తున్నారు.సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించారు. శంకర్ గౌడ్ అంత్యక్రియలు పూర్తయ్యేవిధంగా ఆర్టీసీ జేఏసీ నేతలు చొరవ తీసుకోవాలని పొన్నం ప్రభాకర్ కోరారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయవద్దని విపక్షాలకు ఆయన సూచించారు.అంతకుముందు ఆర్టీసీ జేఏసీ నేతలు సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీతో భేటీ అయ్యి తమ డిమాండ్లను తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో సీనియర్ ఐఏఎస్ కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తరువాత మరోసారి భేటీ అయ్యారు. ఆ తరువాతే - మిగతా 2 లో

## బీఆర్ఎస్ పార్టీపై మరోసారి
# విమర్శలు గుప్పించిన కవిత



- బీఆర్ఎస్ పార్టీ పేరుతో పాటు ఆత్మను కూడా మార్చుకుందని విమర్శ
- మూల సిద్ధాంతం నుంచి తప్పుకుంటే పార్టీ మనుగడ సాగించలేదన్న కవిత
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇంకా మిగిలే ఉన్నాయన్న కవిత

**హైదరాబాద్ :**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం పాతిక సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ పుట్టిందని, కానీ గత కొన్నేళ్లుగా ఆ పార్టీ తన పేరుతో పాటు పనితీరును, పార్టీ ఆత్మను కూడా మార్చుకుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. - మిగతా 2 లో




## మంత్రులు, ఎమ్మెల్యేల
# జీతాల్లో కోత

- తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం కీలక నిర్ణయం
- రిటైర్డ్ ఉద్యోగులకు రూ.6,200 కోట్ల బకాయిల చెల్లింపునకు తెలంగాణ కేబినెట్ ఆమోదం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ భారం పడిందని మంత్రి పొంగులేటి విమర్శ
- మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50% కోత విధించే ప్రతిపాదనకు కేబినెట్ సుముఖత

## హుగ్లీ నదిలో ప్రధాని
## నరేంద్ర మోదీ పడవ ప్రయాణం




- పడవ నడిపేవారితో, మార్నింగ్ వాక్ చేసే వారితో ముచ్చటించిన మోదీ
- కెమెరా చేతబట్టి నది అందాలను క్లిక్‌మనిపించిన మోదీ
- బీజేపీని గెలిపిస్తే ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్న మోదీ

# ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ.. బీజేపీలోకి రాఘవ్ చద్దా


- బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించిన ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా
- మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ ఎంపీలతో కలిసి బీజేపీలో విలీనం!
- అరవింద్ కేజ్రీవాల్‌కు, ఆప్‌కు భారీ రాజకీయ ఎదురుదెబ్బ
- పార్టీ తన ఆశయాలకు దూరమైందంటూ చద్దా విమర్శలు
- రాజ్యసభ ఉపనేత పదవి నుంచి తొలగింపే కారణమని ప్రచారం




## ఒప్పందం కుదరకపోతే దాడులే

- ఇరాన్‌కు ట్రంప్ గట్టి హెచ్చరిక
- చర్చలు విఫలమైతే సైనిక చర్య తప్పదన్న ట్రంప్
- ఇప్పటికే 75 శాతం ఇరాన్ లక్ష్యాలను ధ్వంసం చేశామని వెల్లడి
- హర్మూజ్ జలసంధిని మూసివేసి ఆర్థికంగా దెబ్బతీస్తున్నామన్న ట్రంప్
- ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారనీయబోమని స్పష్టీకరణ
- తాము అణ్వాయుధాలను ఉపయోగించబోమని హామీ




## కొత్త ఏఐ 'మిథోస్' కలకలం

- బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక
- 'క్లాడ్ మిథోస్' అనే కొత్త ఏఐ సైబర్ భద్రతకు ముప్పుగా మారిందన్న ఆందోళనలు
- నిర్మలా సీతారామన్ బ్యాంకర్లతో ఉన్నతస్థాయి సమావేశం
- ముప్పును ఎదుర్కొనేందుకు పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని బ్యాంకులకు ఆదేశం



# కృష్ణా తీరాన
# సింగపూర్ మెరుపులు

- మెరీనా బ్యారేజీని పరిశీలించిన ఏపీ మంత్రులు
- సింగపూర్ పర్యటనలో మెరీనా బ్యారేజీని సందర్శించిన ఏపీ మంత్రుల బృందం
- వరద నియంత్రణ, నీటి సంరక్షణ విధానాలపై అధ్యయనం
- బ్యారేజ్ ప్రాముఖ్యతను వివరించిన ఖూ టెంగ్ చై
- కృష్ణా తీరంలో ఇటువంటి మోడల్ అమలుపై మంత్రుల చర్చ

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఆధునిక హంగులతో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ పర్యటనలో ఉన్న ఏపీ మంత్రుల బృందం, అక్కడి ప్రసిద్ధ మెరీనా బ్యారేజీని సందర్శించి అధ్యయనం చేసింది. వరద నియంత్రణ, నీటి సరఫరా, పర్యాటకాన్ని ఒకేచోట మేళవించిన ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణ శైలిని, - మిగతా 2 లో

## ఇది నాకు కూడా
# కొత్తగానే ఉంది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ శిబిరానికి హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు
- రాజకీయ పోరాటాలు చేశాను కానీ నేరగాళ్లతో పోరాడటం కొత్తగా ఉందని వ్యాఖ్యలు
- దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు ఉదంతాలను ప్రస్తావిస్తూ క్యాడర్‌ను అప్రమత్తం చేసిన సీఎం
- కార్యకర్తలే టీడీపీకి అధినేతలని, ప్రతి ఒక్కరూ నాయకుడిగా ఎదగాలని పిలుపు
- ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని దిశానిర్దేశం



**అమరావతి :**

"నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను కానీ, నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి రావడం నాకు కూడా కొత్తగానే ఉంది" అంటూ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. వైసీపీని ఒక 'కిల్లర్ పార్టీ'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ కౌంటర్ ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలో లేకపోయినా వారి అరాచకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల కడపలో జరిగిన దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారం వంటి ఘటనలను ఉదాహరణలుగా చూపించారు. "కడపలో ప్రభుత్వ భూముల పంపకాల్లో తేడాలు రావడంతో సొంత పార్టీ కార్యకర్త దస్తగిరినే హత్య చేశారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, - మిగతా 2 లో




## బీటెక్ విద్యార్థులే లక్ష్యంగా
# హ్యూమన్ ట్రాఫికింగ్

- ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ
- ట్రాఫికింగ్ పై విజయవాడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన రాయపాటి శైలజ
- ట్రాఫికింగ్ అనేక రూపాల్లో జరుగుతుందన్న శైలజ
- ఉద్యోగాలు ఇప్పిస్తామని విదేశాలకు తీసుకెళ్లి సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారని వెల్లడి

# సంపాదకీయం

## చక్కబడేదెన్నడు?

మణిపూర్‌లో తీవ్ర హింసాత్మక ఘటనలు జరిగి మూడేళ్లు కావస్తున్నా అక్కడింకా పరిస్థితులు చక్కబడలేదని తాజా ఉదంతాలు నిరూపిస్తున్నాయి. 2023 మే నెలలో హింసకు దారితీసిన వదంతులే ఇప్పటికీ ఆ రాష్ట్రాన్ని శాసిస్తున్నాయి. బీరేన్ సింగ్ నాయ కత్వంలోని బీజేపీ ప్రభుత్వం పోయి రాష్ట్రపతి పాలన వచ్చింది. అది ఏడాది కొనసాగాక మొన్న ఫిబ్రవరిలో ఆ పార్టీకి చెందిన ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యాన కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కానీ పరస్పర అపనమ్మకం, జాతి విద్వేషాలు ఆగిందిలేదు. వందలాదిమంది ఆయుధాలు ధరించి గుంపులుగా బయల్దేరి ఊళ్లమీద పడి నిర్విచక్షణగా హత్యాకాండకు, అత్యాచారాలకు పాల్పడటం, ప్రార్థనా స్థలాలు, ఆవాసాలు తగలబెట్టడం ఇప్పుడు లేక పోవచ్చుగానీ... అవతలి పక్షంపై ఆగ్రహావేశాలు తగ్గలేదు. తరచుగా నిరసన ప్రదర్శనలు జరగటం, రహదారులను స్తంభింపజేయటం ఆగలేదు. కేంద్ర బలగాల సంఖ్యను పెంచటం, నిరంతర పహారా వంటివి హింసాత్మక ఉదంతాలను గణనీయంగా కట్టడి చేశాయి. కానీ ఇప్పటికీ విద్వేషాన్ని రెచ్చగొట్టే సందేశాలూ, తప్పుడు సమాచారం వ్యాప్తిలోనే ఉన్నాయి.ఈ నెల మొదటివారంలో ఒక ఇంటిపై బాంబుపడి ఇద్దరు పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఆ బాంబు కుకీలు నివసిస్తున్న ప్రాంతంనుంచి వచ్చిపడిందనీ, వారికి భద్రతా బలగాలు కొమ్ముకాస్తున్నా యనీ ప్రచారం వెల్లువెత్తడంతో జనం ఒక సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడి చేశారు. అటుగా వాహనంలో వెళ్తున్న అస్సాం రైఫిల్స్‌కు చెందిన అధికారిని గుంపు చుట్టుముట్టి దౌర్జన్యం చేసింది. ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తుండగా భద్రతా బలగాలు రక్షించగలిగాయి. మొన్న మంగళవారం ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ముఖ్య మంత్రిని ఆందోళనకారులు అడ్డుకున్నప్పుడు లాఠీచార్జి చేసినా, బాష్పవాయు గోళాలు ప్రయోగించినా ఫలితం లేకపోయింది. చివరకు హెలికాప్టర్ తెప్పించుకుని అక్కడినుంచి ఆయన బయటపడాల్సి వచ్చింది. అంతకుముందు ఒక మాజీ సైనికుడితో సహా ఇద్దరు నాగా జాతీయుల్ని మిలిటెంట్లు హతమార్చారు.మూడేళ్ల క్రితం మెయితీలకూ, కుకీలకూ మధ్య వైరం హింసకు దారితీయగా ఇప్పుడు మెయితీల గురి నాగాలపై కూడా పడింది. ఒక పద్ధతి ప్రకారం వదంతులు వ్యాప్తిచేయటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించటం ఇంకా ఆగలేదు. అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమంటే... ఆ వదంతుల్ని ఖండిస్తూ పోలీసులు ప్రకటనలు విడుదల చేస్తున్నారు. కానీ ఉద్రిక్తతల్ని ఆపటంలో అవి పెద్దగా ఉపయోగపడటం లేదు. గతంలో బీరేన్ సింగ్ ప్రభుత్వ హయాంలో మెయితీలకు చెందిన సాయుధ మిలిటెంట్ సంస్థ ఆరంబాయ్ టెంగోల్‌ను చూసీచూడనట్టు వదిలేశారు. కుకీల 'దురాక్రమణల్ని' అడ్డుకునే పేరిట ఏర్పడిన ఆ సంస్థ కుకీలకూ, నాగాలకూ మాత్రమే కాదు, వారిని ప్రశ్నించే మెయితీలకు సైతం పెద్ద బెడదగా పరిణమించింది. బెదిరించటం, దౌర్జన్యం చేయటం, బలవంతంగా వసూళ్లకు పాల్పడటం ఆ సంస్థకు నిత్యకృత్యమైంది.మూడేళ్లనాటి ఉదంతాలతో పోలిస్తే హింసాత్మక ఘటనలు తగ్గివుండొచ్చు. కానీ ఇప్పటికీ సమాజం చీలికలు, పేలికలుగా ఉంది. మెయితీలూ, కుకీలూ ఒకరి ప్రాంతంలోకి ఒకరు వెళ్లలేకపోతున్నారు. పనిచేయగలిగిన సత్తావుండి అది దొరుకుతుందన్న భరోసా ఉన్నచోటకు పోలేకపోవటం, పై చదువులకు అర్హతలున్నా ఊరు కదల్లేక పోవటంకన్నా మించిన హింస ఏం ఉంటుంది? పరిమిత వనరులు, ఉపాధి లేమి, భిన్న తెగలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవటంవంటి కారణాలవల్లే అసంతృప్తి అవధులు దాటుతోంది.యువతకు ఉపాధి కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం, వారికి మెరుగైన అవకాశాలు రావటానికి తగిన ప్రణాళికలు రూపకల్పన చేయటంవంటి ప్రయత్నాలు ఎక్కడా కనబడవు. కనుకనే మిలిటెంట్ సంస్థల ఆధిపత్యం సాగుతోంది. మౌలిక సమస్యల్ని పరిష్కరించలేని రాజకీయ నేతలు ఓట్లు రాబట్టుకోవటానికి మాత్రం ఆయా తెగల్ని శాసించగల మిలిటెంటు సంస్థలకు సహకరిస్తున్నారు. ఇది కొనసాగినంత కాలమూ మణిపూర్ నెత్తురోడుతూనే ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిస్తేనే ఆ రాష్ట్రం తెరిపిన పడుతుంది.

## కృష్ణా తీరాన సింగపూర్ మెరుపులు

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహణ విధానాలను మంత్రులు క్షుణ్ణంగా పరిశీలించారు.తమ సింగపూర్ పర్యటనలో నాలుగో రోజు హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు మెరీనా బ్యారేజీని సందర్శించారు. పర్యావరణానికి హాని కలగకుండా నీటి సమస్యలను అధిగమించడం, గ్రీన్ రూఫ్ వంటి కట్టడాలతో దీనిని ఒక పర్యాటక కేంద్రంగా ఎలా తీర్చిదిద్దారనే విషయాలను నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ సిటీస్ డైరెక్టర్ ఖూ టెంగ్ చై మంత్రుల బృందానికి వివరించారు.ఈ పర్యటన అనంతరం హోంమంత్రి అనిత స్పందిస్తూ, మెరీనా బ్యారేజ్ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలో, కృష్ణా నది తీరాన కూడా ఇటువంటి ఆధునిక అభివృద్ధి నమూనాలను అమలు చేసే అవకాశాలపై తమ బృందం చర్చించినట్లు వెల్లడించారు.

## ఒప్పందం కుదరకపోతే దాడులే

**మొదటిపేజీ తరువాయి -** ఇరాన్‌తో చర్చలు విఫలమైతే సైనిక చర్య పునఃప్రారంభించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. అయితే, ఒప్పందం కుదుర్చుకోవడానికి తనకేమీ తొందరలేదని స్పష్టం చేశారు. శాశ్వతమైన ఒప్పందం కోసమే చూస్తున్నానని, ఒకవేళ టెహ్రాన్ ఒప్పుకోకపోతే మిగిలిన 25 శాతం లక్ష్యాలను కూడా సైనిక చర్య ద్వారా పూర్తి చేస్తానని ఆయన అన్నారు.ఇప్పటికే జరిగిన దాడుల్లో ఇరాన్ సైన్యాన్ని పూర్తిగా ఓడించామని ట్రంప్ పేర్కొన్నారు. "మేం ఇప్పటికే 75 శాతం లక్ష్యాలను ఛేదించాం" అని చెబుతూ, ఇరాన్ నావిక, వాయు, క్షిపణి సామర్థ్యాలకు తీవ్ర నష్టం కలిగించామని వివరించారు. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు దాన్ని మూసివేశామని తెలిపారు. "మేం జలసంధిని తెరిస్తే, వారికి రోజుకు 500 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుంది. ఒప్పందం కుదిరే వరకు అలా జరగనివ్వను" అని ఆయన అన్నారు.ఈ వివాదం మొత్తం ఇరాన్ అణ్వస్త్రం చుట్టూనే తిరుగుతోందని ట్రంప్ స్పష్టం చేశారు. "వారు అణు బాంబును కలిగి ఉండటానికి వీల్లేదు. దాన్ని మేం జరగనివ్వం" అని అన్నారు. అదే సమయంలో అమెరికా మాత్రం అణ్వాయుధాలను ఉపయోగించదని హామీ ఇచ్చారు. "నేను దాన్ని వాడను. అణ్వాయుధాన్ని ఎవరూ ఉపయోగించకూడదు" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా విజ్ఞప్తి మేరకు ఇరాన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొంటున్న ఎనిమిది మంది మహిళలను విడుదల చేయనున్నారని, ఇది తమ దౌత్యపరమైన విజయమని ఆయన సూచించారు.

## మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్రాంత ఉద్యోగులకు భారీ ఊరట కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గత పదేళ్లుగా పేరుకుపోయిన రూ.6,200 కోట్ల రిటైర్మెంట్ బకాయిలను రాబోయే 100 రోజుల్లో చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. 2014 తర్వాత పదవీ విరమణ పొంది, రావాల్సిన ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల పట్ల మానవీయ దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు, అవసరమైన నిధుల సమీకరణకు ప్రభుత్వం తక్షణమే ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉన్న ఈ 'రెవెన్యూ రిసోర్సెస్ మొబిలైజేషన్ కమిటీ' నేటి నుంచే కార్యాచరణను ప్రారంభించనుంది. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సంఘాలతో చర్చించి పక్కా ప్రణాళికను సిద్ధం చేయనుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం నిలుపుదల చేసి ఆ నిధులను బకాయిల చెల్లింపునకు సర్దుబాటు చేయాలన్న ప్రతిపాదనకు మంత్రులంతా ఏకగ్రీవంగా తమ ఆమోదం తెలిపారు.గురువారం జరిగిన కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 2014కు ముందు ఉద్యోగులు రిటైర్ అయిన నెల రోజుల్లోనే అన్ని ప్రయోజనాలు అందేవని, కానీ కేసీఆర్ హయాంలో వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఒక్క రూపాయి కూడా బకాయి లేదని, ఇప్పుడు రూ.6,200 కోట్ల భారాన్ని తమ ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తోందని స్పష్టం చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబాలు పడుతున్న ఆవేదనపై కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని ఆయన వివరించారు.బకాయిల చెల్లింపు షెడ్యూల్‌పై పూర్తి స్థాయి స్పష్టత కోసం వచ్చే నెల 4వ తేదీన మరోసారి మంత్రివర్గం సమావేశం కానుంది. ఇకపై రిటైర్డ్ ఉద్యోగులు సచివాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే నిధులు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది.

# ఇది నాకు కూడా కొత్తగానే ఉంది



**మొదటిపేజీ తరువాయి -** జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ఈ దోపిడీకి పాల్పడ్డారు. వాళ్ల మనుషుల్ని వాళ్లే చంపుకుని, ఆ నేరాన్ని మనపై నెట్టే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వాటి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి" అని చంద్రబాబు హెచ్చరించారు. అదేవిధంగా, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య ఉదంతాన్ని గుర్తుచేస్తూ, ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను సైతం బెదిరించారని ఆరోపించారు. "రోడ్ల మీదకు వస్తారు, రెచ్చగొడతారు, ప్రజలను ఇబ్బందులు పెడతారు. చర్యలు తీసుకుంటే దాన్ని రాజకీయం అంటారు. అన్యాయం జరిగిందని పరామర్శకు వెళ్లి, సొంత కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపుతారు. కానీ తన కారు కింద పడిన కార్యకర్తను మాత్రం పరామర్శించరు. ఇలాంటి పార్టీని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.2019-24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తుచేయాలని, అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, వాటి అమలులో పడుతున్న కష్టాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. "నన్ను అరెస్టు చేసినా, పార్టీని ఎన్ని ఇబ్బందులు పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నాను. టీడీపీలో కార్యకర్తలే అధినేతలు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతాం. రైట్ రాయల్‌గా బతకాలి. పార్టీ ఇచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని మీరు ఎదగాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు మంచి చేస్తే వారే మనల్ని గుర్తుంచుకుంటారని చంద్రబాబు హితవు పలికారు.

## బీటెక్ విద్యార్థులే లక్ష్యంగా హ్యూమన్ ట్రాఫికింగ్




**మొదటిపేజీ తరువాయి -** మానవ అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పలు కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా రైల్వే పోలీసులతో కలిసి విజయవాడ రైల్వే స్టేషన్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రైల్వే డివిజనల్ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ట్రాఫికింగ్ అనేది అనేక రూపాల్లో జరుగుతుందని శైలజ తెలిపారు. యువతను సోషల్ మీడియా ద్వారా ఆకర్షిస్తున్నారని... ముఖ్యంగా బీటెక్ చదువుతున్న విద్యార్థులను విదేశాలకు పంపిస్తామని చెప్పి, అక్కడకు తీసుకెళ్లి సైబర్ నేరాల్లో పాల్గొనేలా చేస్తున్నారని తెలిపారు. ఇది కొత్త రకం ట్రాఫికింగ్ అని చెప్పారు.అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు విశాఖపట్నంలో రోబోటిక్ సిస్టమ్ వంటి ఆధునిక టెక్నాలజీని వాడుతున్నట్లు తెలిపారు. బాధితులను కేవలం రక్షించడమే కాకుండా, వారు అనుభవించే మానసిక ఒత్తిడి నుంచి బయటపడేసేందుకు సైకలాజికల్ కౌన్సెలింగ్ కూడా అవసరమని ఆమె పేర్కొన్నారు. అపరిచితులతో సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని, ఏ చిన్న అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

## హుగ్లీ నదిలో ప్రధాని నరేంద్ర మోదీ పడవ ప్రయాణం



**మొదటిపేజీ తరువాయి -** ప్రధానమంత్రి నరంద్ర మోదీ శుక్రవారం ఉదయం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో పడవ ప్రయాణం చేశారు. పడవ నడిపేవారితో, మార్నింగ్ వాక్ చేసే వారితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. హుగ్లీ నదిలో బోట్ రైడ్ చేసిన మోదీ, కెమెరా చేతబట్టి నది అందాలను క్లిక్‌మనిపించారు.హుగ్లీ నది బెంగాల్ సంస్కృతిలో ముడిపడి ఉందని మోదీ పేర్కొన్నారు. బెంగాలీల జీవితాల్లో గంగానదికి ప్రత్యేక స్థానం ఉందని, దాని జలాలు ఒక ప్రాచీన నాగరికత స్ఫూర్తిని మోసుకు వెళ్తున్నాయని పేర్కొన్నారు. ఈరోజు ఉదయం కొద్దిసేపు హుగ్లీ నది తీరంలో గడిపినట్లు పేర్కొన్నారు. పడవ నడిపే వారితో, ఉదయపు నడకకు వచ్చిన వారితో కాసేపు ముచ్చటించినట్లు తెలిపారు. పడవ నడిపేవారి శ్రామిక శక్తిని మోదీ ప్రశంసించారు.ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తమ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేస్తుందని అన్నారు. హుగ్లీ నది ఒడ్డున తాను వెచ్చించిన సమయం చాలా ప్రత్యేకమైనదని మోదీ మరో పోస్టులో పేర్కొన్నారు. చారిత్రాత్మక విద్యాసాగర సేతు, హౌరా వంతెనను దగ్గరగా చూడటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ.. బీజేపీలోకి రాఘవ్ చద్దా



**మొదటిపేజీ తరువాయి -** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి భారీ రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు, కీలక నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా బీజేపీలో చేరనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తనతో పాటు మూడింట రెండొంతుల మంది ఆప్ రాజ్యసభ సభ్యులు కూడా బీజేపీలో విలీనం కానున్నారని చెప్పడం సంచలనం సృష్టించింది.ఢిల్లీలో సీనియర్ ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాఘవ్ చద్దా ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "15 ఏళ్లుగా ఆప్‌కు అంకితభావంతో పనిచేశాను. కానీ ఒకప్పుడు అవినీతి నిర్మూలన నినాదంతో అధికారంలోకి వచ్చిన పార్టీ ఇప్పుడు నిజాయతీ రాజకీయాలకు దూరమైంది. నేను సరైన వ్యక్తినే, కానీ తప్పుడు పార్టీలో ఉన్నాను. అందుకే పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను" అని వ్యాఖ్యానించారు.ఆప్‌కు రాజ్యసభలో మొత్తం 10 మంది సభ్యులు ఉండగా, వారిలో మూడింట రెండొంతుల మంది తనతో పాటు బీజేపీ వైపు వస్తున్నారని చద్దా పేర్కొన్నారు. వీరిలో ప్రముఖ క్రీడాకారుడు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ వంటి వారు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా పార్టీలో రాఘవ్ చద్దా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన్ను రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి తొలగించి, ఆ స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఈ పరిణామం పార్టీ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలోనే చద్దా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే పలు సవాళ్లను ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ నాయకత్వానికి ఈ పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది.

# కొత్త ఏఐ 'మిథోస్' కలకలం



**మొదటిపేజీ తరువాయి -** "క్లాడ్ మిథోస్" అనే అత్యంత శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ మోడల్ వల్ల భారత బ్యాంకింగ్ రంగానికి పొంచి ఉన్న సైబర్ ముప్పుపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం వివిధ బ్యాంకుల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు.ఆంత్రోపిక్ అనే ఏఐ స్టార్టప్ అభివృద్ధి చేసిన 'క్లాడ్ మిథోస్' సైబర్ భద్రత విషయంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందింది. మనుషులు గుర్తించడంలో విఫలమైన వేలాది సైబర్ భద్రతా లోపాలను ఇది కనుగొన్నట్లు సమాచారం. కొన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో 27 ఏళ్లుగా ఉన్న లోపాలను కూడా ఇది బయటపెట్టింది. అందుకే దీన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఇది చెడు ఉద్దేశాలున్న వారి చేతికి చిక్కితే, అధునాతన హ్యాకింగ్ సామర్థ్యాలు పొందినట్లేనని ఆంత్రోపిక్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొందరు అనధికారికంగా ఈ ఏఐని యాక్సెస్ చేశారన్న వార్తలు ఆందోళన రేపుతున్నాయి.ఈ ముప్పు అసాధారణమైనదని, బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య అత్యంత జాగరూకత, సమన్వయం అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ముప్పును నిజ సమయంలో గుర్తించి, దాని వివరాలను బ్యాంకులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వంటి సంస్థల మధ్య పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే స్పందించేందుకు వీలుగా ఒక సమన్వయ సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు మంత్రి సూచించారు.కేవలం భారత్‌లోనే కాకుండా, అమెరికా ప్రభుత్వం కూడా 'మిథోస్' ముప్పుపై వాల్‌స్ట్రీట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. మరోవైపు, ఈ ఏఐ వల్ల భారత ఆర్థిక రంగానికి ఎంత మేరకు ప్రమాదం ఉందనే అంశంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనం చేస్తున్నాయి.

# ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ



**మొదటిపేజీ తరువాయి -** వారు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల బృందాన్ని కలిశారు.రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు మొత్తం 32 డిమాండ్లను మంత్రుల ముందు ఉంచారు. 29 డిమాండ్లపై మంత్రుల బృందం సానుకూలంగా స్పందించింది. ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు, పీఆర్‌సీపై చర్చలు కొనసాగుతున్నాయి.ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి చాలా బాధాకరమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా కార్మికులకు పిలుపునిద్దామని తెలిపారు. కూర్చుని మాట్లాడుకుంటే ఖచ్చితంగా పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో జరిగిన చర్చల సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అనేది మన రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు.మన సంస్థను మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందన్న భట్టి విక్రమార్క అప్పటి పాలకులు ఎంత కఠినంగా ప్రవర్తించారో మీరందరూ చూశారని వివరించారు. గత పాలకుల మాదిరిగా తాము వ్యవహరించబోమని స్పష్టం చేశారు. ఆర్టీసీకి సంబంధించిన పాలనాపరమైన, విధానపరమైన నిర్ణయాలపై కచ్చితంగా చర్చిద్దామన్నారు. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకుందామన్నారు.మరోవైపు ఆర్టీసీ కార్మికులు అధైర్యపడవద్దని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్చలు జరుపుతోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటన విడుదల చేశారు. కార్మికులు ప్రజాస్వామ్య పద్ధతి లో నిరసనలు తెలుపుకోవాలని, ఆవేశంలో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు నిరసనలకు మద్దతు ఇవ్వడం వల్ల అభ్యంతరం లేదని, అయితే కార్మికులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదని హితవు పలికారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లే శంకర్ గౌడ్ లాంటి ఘటనలు జరుగుతున్నాయన్న పొన్నం, నేతలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.శంకర్‌గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం చేసేందుకు ఆర్టీసీ జేఏసీ నేతలు నిర్ణయించారు. కార్మికుల వేతనం నుంచి రూ.300 లేదా రూ.200 ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రతీ ఉద్యోగి రూ.300 లు ఇస్తే రూ.1.30 కోట్లు, రూ.200 లు ఇస్తే రూ.75 లక్షలు శంకర్‌గౌడ్ కుటుంబానికి ఇవ్వనున్నారు.

## బీఆర్ఎస్ పార్టీపై మరోసారి విమర్శలు గుప్పించిన కల్వకుంట్ల కవిత



**మొదటిపేజీ తరువాయి -** నేడు కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్న నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడారు.పేరు మార్పు మొదలు ప్రతి విషయంలో టీఆర్ఎస్ మారిందని, దీనితో ఆ పార్టీకి ప్రజలతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా తన ప్రాథమిక ఉద్దేశం, మూల సిద్ధాంతం నుంచి పక్కకు తప్పుకుంటే ఆ పార్టీ ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని అన్నారు. బీఆర్ఎస్ తన ప్రాథమిక ఉద్దేశం నుంచి పక్కకు తప్పుకోవడం వల్ల ఆ పార్టీకి ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు.ప్రభుత్వం మారినా తెలంగాణలో ఎన్నో సమస్యలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆంక్షలు ఇంకా మిగిలే ఉన్నాయని అన్నారు. వీటిని సాధించడమే తాను ప్రారంభించబోయే పార్టీ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజల కోసం పని చేసే స్వచ్ఛమైన ప్రాంతీయ పార్టీ అవసరం ఇప్పుడు తెలంగాణకు ఉందని అన్నారు.

Since 2004
పిడికిలి
The Peoples Paper

శనివారం 25 - 04 - 2026

# రోజూ పైసల పండగే.. సామాన్యుడికి గుండె మంటగే!

## జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచ్చలవిడి అవినీతి



**జగిత్యాల, ఏప్రిల్ 23, :**(పిడికిలి జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 'మూడు దస్తావేజులు.. ఆరు పచ్చనోట్లు' అనే నినాదంతో అవినీతి రాజ్యమేలుతుండగా, జగిత్యాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. సేవా కేంద్రంగా ఉండాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం 'అవినీతి మాఫియా' అడ్డాగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. చట్టం ముసుగులో సాగుతున్న దోపిడీకి సామాన్యులు బలవుతున్నారని, అధికారుల కుర్చీ నుంచి అటెండర్ వరకు ప్రతి ఒక్కరూ పచ్చనోట్ల వేటలో పడి సామాన్యుడిని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోజుకు లక్షల్లో అక్రమ వసూళ్లుఈ కార్యాలయంలో రోజుకు లక్షలాది రూపాయల అక్రమ సొమ్ము చేతులు మారుతున్నట్లు సమాచారం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి సుమారు రూ.72 కోట్ల అవినీతి సామ్రాజ్యం నడుస్తుండగా, అందులో జగిత్యాల వంతు ప్రధాన కేంద్రంగా మారిందని తెలుస్తోంది.స్లాట్ బుకింగ్ మొదలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరాయంగా వసూళ్లు సాగుతున్నాయి. నాలా కన్వర్షన్‌కు రూ.10 వేలు, ఇంటి రిజిస్ట్రేషన్‌కు రూ.7 వేలు, వివాహ రిజిస్ట్రేషన్‌కు సైతం రూ.1,200 అదనంగా వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.'సర్వర్ బిజీ' పేరుతో దోపిడీఅక్రమంగా వసూళ్ల చేసేందుకు 'సర్వర్ బిజీ', 'డాక్యుమెంట్లలో తప్పులున్నాయి' అంటూ సాకులు వెతుకుతూ బాధితులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, చివరకు లంచం ఇస్తేనే పని జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. పైసలు ముట్టకపోతే ఫైలు కదలదు, పైసలు ముడితేనే ఫైలుకు మోక్షం అనే పరిస్థితి నెలకొందని విమర్శలు వస్తున్నాయి.ఒక రిజిస్ట్రేషన్‌కు సగటున రూ.6 వేలు వసూలు చేస్తే, రోజుకు సుమారు 30 రిజిస్ట్రేషన్లు జరిగితే రూ.1.80 లక్షలు అక్రమంగా వసూలు అవుతున్నట్లు అంచనా. నెలకు రూ.45 లక్షలు, ఏడాదికి రూ.5.4 కోట్ల వరకు అవినీతి సొమ్ము పోగవుతోందని సమాచారం.డిజిటల్ పేమెంట్ల రూపంలోనూ వసూళ్లుఇటీవల ఏసీబీ దాడులు జరిగినా, అధికారుల తీరులో మార్పు రాకపోవడం గమనార్హం. ఫ్రష్తశీఅవూవ, ఈఖు౦ వంటి డిజిటల్ పేమెంట్ల రూపంలో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్, ఏసీబీ అధికారులు తనిఖీలు చేసినప్పటికీ, డాక్యుమెంట్ రైటర్లను అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు.ప్రభుత్వం స్పందించాలిప్రజల కష్టార్జితాన్ని, ఆస్తులను అడ్డంగా దోచుకుంటున్న ఈ అక్రమార్కులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని జగిత్యాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి నిలయవుద్దామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులారా.. మీ అక్రమ సామ్రాజ్యంపై ప్రజల ఆగ్రహం పెల్లుబుకుతోంది, ఇకనైనా ఈ దోపిడీ ఆపండి అని జగిత్యాల ప్రజలు వేడుకుంటున్నారు.

# కోరుట్లలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ నేతల సంఘీభావం

## శంకర్ గౌడ్ కుటుంబానికి 5 కోట్ల ఎక్స్‌గ్రేషియా డిమాండ్

**కోరుట్ల ,ఏప్రిల్ 24(పిడికిలి):**కోరుట్లలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ నేతల సంఘీభావం శంకర్ గౌడ్ కుటుంబానికి 5 కోట్ల ఎక్స్‌గ్రేషియా డిమాండ్కోరుట్ల పట్టణ బస్టాండ్ సమీపంలో ఆర్టీసీ కార్మికులు తమ హక్కులు, వేతన పెంపు, ఉద్యోగ భద్రత మరియు సంక్షేమ అంశాల సాధన కోసం చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరింది. ఈ సమ్మెకు భారతీయ జనతా పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వై. అనూప్ రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ, నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గుంటుక సదాశివ్, జిల్లా నాయకుడు సుదవేణి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, మాజీ కౌన్సిలర్ పెండం గణేష్, సీనియర్ నాయకులు గిన్నెల శ్రీకాంత్, మ్యాకల గణేష్, ధమ్మా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, యూనియన్ల పునరుద్ధరణ, పెండింగ్ పీఆర్సీ అమలు, అలాగే ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 32 ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె కొనసాగుతున్నదని తెలిపారు.చర్చలకు ప్రభుత్వం పిలిచినప్పటికీ ఫలితం రాకపోవడంతో సమ్మె కొనసాగుతుందని జేఏసీ పేర్కొంది. ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం 5 కోట్ల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు.అలాగే కార్మికులు శాంతియుతంగా నిరసనలు కొనసాగించాలని, ఐక్యతతో తమ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే చర్చలు పునరుద్ధరించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



# జిహెచ్ఎంసి డంప్ యార్డు కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు

**పటాన్చెరు, ఏప్రిల్ 24 (పిడికిలి) :**జిహెచ్ఎంసి డంప్ యార్డు కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి చెల్లించాలని, అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు వెంటనే అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.శుక్రవారం పటాన్చెరు సాకి చెరువు పక్కన ఉన్న జిహెచ్ఎంసి డంప్ యార్డు లిఫ్టింగ్ సెంటర్ వద్ద సిఐటియు యూనియన్ నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇక్కడ దాదాపు వందమంది డ్రైవర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారని తెలిపారు. హైదరాబాదు నగరంలోని చెత్తను జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని రాంకీ డంపింగ్ యార్డుకు తరలించే పనిలో ఈ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు.గత 10 నుంచి 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఈ కార్మికులకు సరైన వేతనాలు లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయడంతో పాటు, యాజమాన్యం ఒప్పందం ప్రకారం హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని రాంకీ యాజమాన్యాన్ని కోరారు.మేడే వారోత్సవాల సందర్భంగా సిఐటియు నూతన జెండా ఆవిష్కరణ చేపట్టామని తెలిపారు. 1886లో అమెరికాలోని చికాగోలో జరిగిన కార్మిక పోరాటాల ఫలితంగానే మేడే ఆవిర్భవించిందని, ఆ పోరాట స్ఫూర్తితోనే నేడు ఎనిమిది గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. కొన్ని రాష్ట్రాల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.సిఐటియు ఎర్రజెండా కార్మికులకు అండగా నిలుస్తుందని, కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో డంప్ యార్డు కార్మికుల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, మే 1న జరిగే మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జావేద్, వలి, స్వామి, రాజేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# రైతుల సమస్యలు పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై జీవన్ రెడ్డి తీవ్ర విమర్శలు



**రాయికల్, ఏప్రిల్ 24 (పిడికిలి):**రాయికల్ పట్టణంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేత, బీసీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభకు టీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, రైతులు, దళితులు, బలహీన వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడం శుభ పరిణామమని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగానికి రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేసిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రెండు ఎకరాలకే పరిమితం చేసిందని విమర్శించారు. కేసీఆర్ జగిత్యాలలో సభ నిర్వహించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి మేడిగడ్డ వద్ద సభ ఏర్పాటు చేసి రెండు ఎకరాల వారికి మాత్రమే రైతుబంధు ప్రకటించడం రాజకీయ ఉద్దేశంతో చేసిన చర్య అని అన్నారు.గతంలో వరి, మొక్కజొన్నలను ఎలాంటి పరిమితులు లేకుండా కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం మొక్కజొన్న కొనుగోలును ఎకరాకు 25 క్వింటాళ్లకు పరిమితం చేశారని తెలిపారు. అది కూడా యాప్‌లో నమోదు చేసినప్పుడే కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.25 క్వింటాళ్ల పరిమితి కారణంగా మద్దతు ధర రూ.2400 ఉండగా, రైతులు బయట మార్కెట్‌లో రూ.1800కే అమ్ముకోవాల్సి వస్తోందని, ప్రతి క్వింటాల్‌కు రూ.600 చొప్పున రైతులు నష్టపోతున్నారని చెప్పారు. దీనివల్ల ఎకరాకు సుమారు రూ.6,000 వరకు రైతులు నష్టపోతున్నారని వివరించారు. రైతు భరోసా పేరిట ఇచ్చే రూ.6,000 కూడా ఈ నష్టాల్లోనే పోతున్నాయని, పోర్టల్‌లో నమోదు కాని రైతులు పూర్తిగా నష్టపోతున్నారని విమర్శించారు.రుణమాఫీ ఆశించిన స్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా కేవలం రిబ్బన్ కటింగ్‌కే పరిమితమయ్యాయని విమర్శించారు.ఎరువుల కోసం కొత్తగా యాప్ తీసుకురావడం వల్ల రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, యూరియా వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే ఉపయోగించబడుతుందని, దీనిపై అనవసర ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ధాన్యం సేకరణ, ఎరువుల పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించే ఫ్యాక్స్ వ్యవస్థ కాలపరిమితి ముగిసి సంవత్సరం గడిచినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో 40 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి పారదర్శకంగా గణాంకాలు సేకరించారని, ఆ సర్వేలో బలహీన వర్గాలు 51 శాతం ఉండగా ఇప్పుడు 46 శాతానికి తగ్గడం ఎలా జరిగిందని ప్రశ్నించారు. సమాజంలో జనాభా పెరుగుతుంటే బలహీన వర్గాల శాతం ఎలా తగ్గిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం మరియు బలహీన వర్గాల సమస్యల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గతంలో కేసీఆర్ గొర్ల కాపరులకు గొర్ల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి వారి జీవనోపాధిని బలోపేతం చేశారని గుర్తు చేశారు.

# జిల్లా పంచాయతీ అధికారులపై మండిపడ్డ సమాచార కమీషన్ పరిహారం కోరిన సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి

## పరిహారం చెల్లించాల్సిందేనని "స్పష్టం చేసిన కమీషన్"







**బుగ్గారం / జగిత్యాల జిల్లా, ఏప్రిల్ 24(పిడికిలి):**తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులపై మండిపడ్డట్లు సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ జారీ చేసిన 18 ఆర్డర్ లకు జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులు సమాచారం ఇవ్వడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఆయన వివరించారు. అందులో నాలుగు కేసులకు మొదటి ఆర్డర్ తో అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో కమీషన్ రెండో సారి కూడా ఆర్డర్ లు జారీ చేశారన్నారు. అయినా నేటి వరకు పంచాయతీ అధికారులు సమాచారం ఇవ్వక పోవడంతో బుధవారం జరిగిన విచారణలో సమాచార కమీషన్ జిల్లా పంచాయతీ అధికారులపై తీవ్రంగా మండిపడినట్లు ఆయన తెలిపారు. గత ఆరేండ్లుగా పంచాయతీ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించారని, వారి విధులను, బాధ్యతలను దుర్వినియోగం చేశారని, కమీషన్ ఆర్డర్ లను కూడా బేఖాతర్ చేశారని చుక్క గంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ దృష్టికి వ్రాత పూర్వకంగా తీసుకు వెళ్ళి తనకు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో సమాచారం ఇవ్వనందున పరిహారం చెల్లించాల్సిందేనని సమాచార కమీషన్ స్పష్టం చేసినట్లు చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్స్ జారీ



మే 1, 2026 నుంచి అమల్లోకి రానున్న ఉత్తర్వులుశిఖా గోయల్ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియామకంసైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ ల్యాబ్ అదనపు బాధ్యతలు కొనసాగింపుదేవేంద్ర సింగ్ చౌహాన్ విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా బదిలీషాహ్నవాజ్ ఖాసిమ్ మల్టీ జోన్-2 ఐజీపీగా నియామకంపర్సనల్ ఐజీపీ అదనపు బాధ్యతలు అప్పగింతతరుణ్ జోషి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియామకంసుధీర్ బాబు పదవీ విరమణ నేపథ్యంలో పోస్టింగ్అవినాష్ మహంతి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా బదిలీఏసీబీ డైరెక్టర్ అదనపు బాధ్యతలుబి. సుమతి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియామకం కార్తికేయ ఐజీపీ ఇంటెలిజెన్స్‌కు అదనపు బాధ్యతలు అప్పగింత

## బి. సుమతి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియామకం





**హైదరాబాద్ మల్కాజిగిరి , ఏప్రిల్ 24 (పిడికిలి):**తెలంగాణ ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల బదిలీలు మరియు కొత్త పోస్టింగ్స్ జారీ చేసింది. ఈ ఉత్తర్వులు 2026 మే 1 నుంచి అమల్లోకి రానున్నాయి.ప్రభుత్వ తాజా నిర్ణయాల ప్రకారం శిఖా గోయల్ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఆమె సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరియు ఫోరెన్సిక్ ల్యాబ్ బాధ్యతలను కొనసాగించనున్నారు. దేవేంద్ర సింగ్ చౌహాన్ విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా బదిలీ అయ్యారు.షాహ్నవాజ్ ఖాసిమ్‌ను మల్టీ జోన్-2 ఐజీపీగా నియమించడంతో పాటు పర్సనల్ ఐజీపీ అదనపు బాధ్యతలు అప్పగించారు. తరుణ్ జోషిని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. సుధీర్ బాబు పదవీ విరమణ నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.అవినాష్ మహంతిని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా బదిలీ చేయడంతో పాటు ఏసీబీ డైరెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. బి. సుమతిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియమించారు. కార్తికేయకు ఐజీపీ ఇంటెలిజెన్స్ అదనపు బాధ్యతలు అప్పగించారు.ప్రభుత్వం ఈ బదిలీల ద్వారా పోలీస్ వ్యవస్థలో మరింత సమర్థత, సమన్వయం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# డంపింగ్ యార్డ్ పొగతో ఇబ్బందులు కాలనీవాసుల రాస్తారోకో



**పిడికిలి న్యూస్ । జగిత్యాల :**జగిత్యాల పట్టణంలోని ఇంద్రమ్మ అర్బన్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్తను దహనం చేయడం వల్ల దట్టమైన పొగ వ్యాపించి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డంపింగ్ యార్డ్‌లో తరచుగా చెత్తను కాల్చడంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ పొగతో కమ్ముకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా కాలనీవాసులు చెత్త వాహనాలను అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, చెత్త దహనం వెంటనే నిలిపివేయాలని అధికారులను డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మెట్‌పల్లిలో బీజేపీ కౌన్సిలర్లకు ఘన సన్మానం



**మెట్‌పల్లి, ఏప్రిల్ 24(పిడికిలి):** మెట్‌పల్లి మున్సిపాలిటీలో వివిధ హోదాల్లో నియమించబడిన బీజేపీ కౌన్సిలర్లను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, దిశ కమిటీ సభ్యులు, సీనియర్ అడ్వకేట్ వద్దేపల్లి శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం మెట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో జరిగింది.మున్సిపాలిటీలో నియమించబడిన బీజేపీ కౌన్సిలర్లలో ఫ్లోర్ లీడర్‌గా శ్రీమతి ధర్మపురి స్వరూప వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా బొడ్ల ఆనంద్, ఫ్లోర్ కార్యదర్శిగా శ్రీమతి పుడుకారం దివ్య కిషోర్ రెడ్డి, పార్టీ విప్‌గా దొనికెల శిరీష నవీన్, అలాగే కౌన్సిలర్‌గా కోయల్కార్ స్రవంతి లింగేశ్వర్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా వద్దేపల్లి శ్రీనివాసన్ మాట్లాడుతూ, మన పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచనలతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్ మాట్లాడుతూ, తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అనూప్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలిచి పనిచేస్తామని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మిట్టపెల్లి కృష్ణమూర్తి, 10వ వార్డు పద్మశాలి సంఘం అధ్యక్షులు గోవర్ధన రవీందర్, నూర్ బాషా సంఘం అధ్యక్షులు రబ్బు, తిరుసుల్ల అర్జున్, గుంటుక హన్మాండ్లు, బోగ దత్తు, గోవర్ధన అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# హిందూ సమ్మేళనం ఆధ్యాత్మిక మహోత్సవానికి డా. బోగ శ్రావణికి ఆహ్వానం



**జగిత్యాల ,ఏప్రిల్ 24 (పిడికిలి):**కృష్ణానగర్ బస్తి హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం ఆధ్యాత్మిక మహోత్సవానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డా. బోగ శ్రావణి కి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆకుబత్తిని శ్రీనివాస్, అనుమల్ల శ్యామ్, చౌటపల్లి నారాయణ, మ్యాన సాయి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు జీవన్ రెడ్డి మద్దతు జగిత్యాలలో కార్మికుల ర్యాలీ










**జగిత్యాల, ఏప్రిల్ 24 (పిడికిలి):**పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి మద్దతు తెలిపారు. శంకర్ గౌడ్ మరణంపై సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమ్మెలో భాగంగా ఆర్టీసీ కార్మికులు జగిత్యాలలో ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ ఫ్లెక్సీతో ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ డిపో నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ వరకు సాగింది. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

# యువత శ్రమశక్తితోనే దేశం అభివృద్ధి మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు





**రాయికల్ ,ఏప్రిల్ 24 (పిడికిలి):**రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మి, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎలక్ట్రిషన్, హోమ్ ఎయిడ్ హెల్త్, టైలరింగ్, టూ వీలర్ మెకానిక్ కోర్సుల్లో శిక్షణ పొందిన యువతీ యువకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.గత పది సంవత్సరాలుగా ఈ సంస్థలు సుమారు 2100 మంది నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించగా, అందులో 1500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని నిర్వాహకులు తెలిపారు.మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ యువత తమ శ్రమశక్తిని వెలికితీసి స్వయం ఉపాధి మార్గంలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చేతివృత్తులు, నైపుణ్య శిక్షణ ద్వారా యువత జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటి వద్దనే సేవలు అందించే విధంగా శిక్షణ పొందిన యువత సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచారక్ లింగం శ్రీధర్ జి, మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన ఏప్రిల్- 2026 కౌన్సిల్ సర్వసభ్య సమావేశం




**జగిత్యాల, ఏప్రిల్ 24 (పిడికిలి):**జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణిశ్రీనివాస్ అధ్యక్షతన ఏప్రిల్ 2026 కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో రాబోయే వర్షాకాలం దృష్ట్యా పట్టణ పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. బ్లీచింగ్, కెమికల్స్, ఫాగింగ్ మెషీన్లు, బ్యాక్ హో లోడర్, బ్యాటరీ స్ప్రే మిషన్లు, వెహికిల్ మౌంటెడ్ ఫాగింగ్ పరికరాల కొనుగోలుకు రూ.0.90 కోట్లు మంజూరు చేశారు.బక్రీద్ పండుగ సందర్భంగా ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాట్ల కోసం రూ.0.06 కోట్లు కేటాయించగా, జంక్షన్ ఫౌంటెన్ మరమ్మతులు, రోటరీ పార్క్ అభివృద్ధి, ఫౌంటెన్ పనులకు రూ.0.19 కోట్లు ఆమోదించారు. వేసవి దృష్ట్యా తాగునీటి లీకేజీలు త్వరగా అరికట్టడం, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పారిశుద్ధ్య వాహనాలకు మైక్ సిస్టమ్ ఏర్పాటు వంటి పనులను కూడా ఆమోదించారు.మొత్తం 25 అజెండా అంశాలు సభలో ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సభ్యులు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మునిరొద్దీన్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ ఎ.వీ. స్పందన, అసిస్టెంట్ ఇంజినీర్లు అనిల్, లక్ష్మి, టి.పి.ఓ. శ్రీనివాస్, టి.పి.ఎస్. అశోక్, జె.ఏ.ఓ. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ ఆరోగ్యంపై వాకబు చేయని పిఠాపురం నేతలు.. నాగబాబు ఫైర్!

**పవన్ కల్యాణ్ ఆరోగ్యం మెరుగైందన్న నాగబాబు**

**వారంలోగా విధులకు హాజరవుతారని వెల్లడి**

**పవన్ ఆరోగ్యం గురించి అడగకపోవడంపై పిఠాపురం జనసేన నేతలపై ఆగ్రహం**

**క్షమాపణలు చెప్పిన స్థానిక నాయకులు**



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి ఏ ఒక్కరూ ప్రస్తావించకపోవడంపై ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి ఆరా తీయకుండా, స్థానిక సమస్యలు, ఇతర డిమాండ్లపై మాత్రమే నేతలు మాట్లాడటంతో నాగబాబు అసహనానికి గురయ్యారు. శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై అప్డేట్ ఇచ్చేందుకు నాగబాబు గురువారం పిఠాపురంలో జనసేన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పవన్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, మరో వారం రోజుల్లో ఆయన తిరిగి తన విధుల్లో చేరే అవకాశం ఉందని తెలిపారు. అయితే, ఈ సమావేశంలో నేతలు తమ సమస్యలనే ఏకరువు పెట్టడం మొదలుపెట్టారు. ఫైవ్ మ్యాన్ కమిటీ పనితీరు, కాపు కార్పొరేషన్ ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. దీంతో కల్పించుకున్న నాగబాబు, స్థానిక నేతల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "నేను ఇక్కడికి వచ్చింది వివాదాలు మాట్లాడటానికి కాదు. పవన్ కల్యాణ్ ఆరోగ్యం ఎలా ఉందని మీలో ఒక్కరైనా అడిగారా? ఈ నియోజకవర్గం కోసం ఆయన ఇంత కష్టపడుతుంటే, ఆయన పరిస్థితి గురించి తెలుసుకోవాలనే ఆలోచన కూడా మీకు లేదా? మీకు అసలు కొంచమైనా సెన్స్ ఉందా?" అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. నాగబాబు ఆగ్రహంతో అక్కడున్న నాయకులు ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయారు. అనంతరం తమ తప్పు తెలుసుకుని నాగబాబుకు క్షమాపణలు చెప్పారు. ఈ సమావేశంలో పిఠాపురం అభివృద్ధి గురించి మాట్లాడుతూ.. గత రెండేళ్లలో నియోజకవర్గంలో సుమారు రూ.600 కోట్లు ఖర్చు చేసినట్లు నాగబాబు తెలిపారు. ఎన్నికల హామీలను దశలవారీగా నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. అయితే, రామ్ గోపాల్ వర్మ వివాదంపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. వైద్యుల సలహా మేరకు పవన్ కల్యాణ్ మరో వారం, పది రోజులు పూర్తి విశ్రాంతి తీసుకుని, త్వరలోనే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# దేవదాయ శాఖ ఏసీ శాంతి మళ్లీ ఏసీబీ కస్టడీకి

**ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీ శాంతి రెండోసారి ఏసీబీ కస్టడీకి**

**విచారణకు సహకరించడం లేదని కోర్టుకు తెలిపిన ఏసీబీ అధికారులు**

**రూ.1.37 కోట్ల అక్రమాస్తులు గుర్తించినట్లు వెల్లడించిన ఏసీబీ**

**రెండేళ్లలో రెండుసార్లు సస్పెన్షన్‌కు గురైన అధికారిణి శాంతి**

**విజయవాడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభం**



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెన్షన్‌కు గురైన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) కలింగిరి శాంతిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆమె విచారణకు సహకరించడం లేదని ఏసీబీ చేసిన విజ్ఞప్తి మేరకు, విజయవాడ ఏసీబీ కోర్టు రెండు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో ఇవాళ ఉదయం విజయవాడ జిల్లా జైలులో ఉన్న శాంతిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముందుగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, ఆమెను విచారణ నిమిత్తం తమ కార్యాలయానికి తరలించారు. ఈ కేసులో శాంతిని ఏసీబీ కస్టడీకి తీసుకోవడం ఇది రెండోసారి. గతంలో ఈ నెల 15, 16 తేదీల్లో ఆమెను విచారించేందుకు కోర్టు అనుమతించింది. అయితే, ఆ సమయంలో ఆమె విచారణకు ఏమాత్రం సహకరించలేదని, కీలక సమాచారం రాబట్టాల్సి ఉందని ఏసీబీ అధికారులు కోర్టుకు నివేదించారు. దీంతో మరోసారి కస్టడీకి అనుమతించాలని కోరగా, న్యాయస్థానం అంగీకరించింది. ఈ నెల 7న తాడేపల్లి, ఉండవల్లి, విశాఖపట్నం సహా పలు ప్రాంతాల్లో శాంతికి సంబంధించిన నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో 10 గంటల పాటు సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సోదాల్లో ఆమె ఆదాయానికి మించి రూ.1.37 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. విశాఖపట్నంలో ఒక ఫ్లాట్, కుంచనపల్లిలో జీ+2 భవనం, 776 గ్రాముల బంగారు ఆభరణాలు, దాదాపు 3 కిలోల వెండి వస్తువులు, రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.3 లక్షలు, ఒక కారు, ఒక మోటార్‌సైకిల్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల అనంతరం అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఆమెను అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆమె జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. రెండేళ్ల వ్యవధిలో శాంతి సస్పెన్షన్‌కు గురవడం ఇది రెండోసారి. 2020లో ఏపీపీఎస్సీ ద్వారా దేవదాయ శాఖలో ఏసీగా నియమితులైన ఆమె, 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవకతవకల ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. 2024 జులై నుంచి 2026 మార్చి వరకు సస్పెన్షన్‌లో ఉండి,

# పేదరికాన్ని జయిస్తూ హాకీలో దూసుకెళ్తున్న 15 ఏళ్ల నౌషీన్

**దినసరి కూలీ కుమార్తె... జాతీయ హాకీలో సత్తా**

**విరిగిన హాకీ స్టిక్‌తో శిక్షణ ప్రారంభించిన నౌషీన్**

**మధ్యప్రదేశ్ హాకీ అకాడమీతో మారిన తలరాత**

**అండర్-18 ఆసియా కప్ జట్టులో స్థానం కోసం పోటీ**

**దేశానికి ఆడటమే తన ఏకైక లక్ష్యమని వెల్లడి**



తోటి క్రీడాకారులు ఖరీదైన కిట్లతో శిక్షణ తీసుకుంటుంటే ఆమె మాత్రం అరువు తెచ్చుకున్న సామాగ్రితో సాధన చేస్తోంది. కనీసం ఒక మంచి హాకీ స్టిక్ కూడా కొనలేని నిరుపేద కుటుంబం ఆమెది. కానీ, 15 ఏళ్ల నౌషీన్ నాజ్ ఇప్పుడు భారత మహిళల హాకీ భవిష్యత్ ఆశాకిరణంగా వెలుగొందుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ యువ క్రీడాకారిణి, త్వరలో జపాన్‌లో జరగనున్న అండర్-18 ఆసియా కప్ జట్టులో స్థానం సంపాదించేందుకు అడుగు దూరంలో నిలిచింది. నౌషీన్ తండ్రి అఫ్సాజ్ ఖాన్ రోజుకు కేవలం రూ.250 సంపాదించే ఒక దినసరి కూలీ. భోపాల్‌కు 380 కిలోమీటర్ల దూరంలోని సియోని పట్టణంలో కనీసం పైకప్పు కూడా లేని ఓ అద్దె ఇంట్లో వారి నివాసం. నాలుగేళ్ల క్రితం పాత, విరిగిన హాకీ స్టిక్‌తో నౌషీన్ ప్రస్థానం మొదలైంది. "అది విరిగిపోయిన ప్రతీసారి గుడ్డతో కట్టుకుని ఆడేది తప్ప ఏరోజూ ఫిర్యాదు చేయలేదు" అని ఆమె తండ్రి గతాన్ని గుర్తుచేసుకున్నారు. 2023లో మధ్యప్రదేశ్ హాకీ అకాడమీ కంటపడటంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. శిక్షణ, పౌష్టికాహారం, క్రీడా సామాగ్రి అన్నీ అకాడమీయే సమకూర్చింది. ఈ నెలలో బిహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన 16వ సబ్-జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో నౌషీన్ సత్తా చాటింది. ఏకంగా 9 గోల్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్' అవార్డును కూడా గెలుచుకుంది. ఆట కోసం కూతురు వేసుకునే దుస్తులపై కొందరు విమర్శలు చేసినా, ఆమె తండ్రి అండగా నిలుస్తున్నారు. "నా కూతురిని ఎవరైనా ఆపాలని చూస్తే, ముందు నాతో తలపడాలి" అని ఆయన ధైర్యంగా చెబుతున్నారు. ఏడుగురు సంతానంలో ఒకరైన నౌషీన్ స్ఫూర్తితో ఆమె చెల్లెలు సబారికా కూడా అకాడమీలో చేరింది. "దేశం కోసం ఆడటమే నా ఏకైక లక్ష్యం" అని నౌషీన్ తన ఆశయాన్ని స్పష్టం చేసింది.

# నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య.. స్పందించిన బండి సంజయ్

**శంకర్ గౌడ్‌ది ప్రభుత్వ హత్య అన్న బండి సంజయ్**

**ప్రభుత్వం కాలయాపన కోసం కమిటీలు వేసి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శ**

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారని వెల్లడి**



నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే అన్నారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం కాలయాపన కోసం కమిటీలు వేసి మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలనే అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్‌లలో న్యాయం ఉందని బండి సంజయ్ అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లకు బీజేపీ మద్దతు పలుకుతుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యకు పాల్పడి తమ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, రెండు పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లిస్తామని కాంగ్రెస్ తన 'అభయహస్తం' హామీల జాబితాలో పేర్కొందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణకు అనుమతిస్తామని కూడా చెప్పిందని గుర్తు చేశారు.

# ముఖం కాలిపోయింది, మాట్లాడలేరు.. మొజ్తబా ఖమేనీ ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ..?

**తీవ్ర గాయాలతో అజ్ఞాతంలోకి వెళ్లిన ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ**

**ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిన వైనం**

**భవిష్యత్తులో ఆయన ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం**

**రహస్య లేఖల ద్వారా దేశాన్ని పాలిస్తున్నారని వెల్లడించిన 'ది న్యూయార్క్ టైమ్స్'**

**అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి.. కీలక నిర్ణయాలన్నీ వారే తీసుకుంటున్నారని వెల్లడి**



ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బతికే ఉన్నారు, స్పృహలోనే ఉన్నారు. కానీ ఓ దాడిలో తీవ్రంగా గాయపడటంతో ఆయన ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లారు. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లింది. ఈ సంచలన విషయాలను 'ది న్యూయార్క్ టైమ్స్' తన ప్రత్యేక కథనంలో వెల్లడించింది. పత్రిక కథనం ప్రకారం మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలైనప్పటికీ, ఆయన మానసికంగా చాలా చురుగ్గా ఉన్నారు. అయితే, ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతింది. ఆయన కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కృత్రిమ కాలు కోసం ఎదురుచూస్తున్నారని రిపోర్ట్ పేర్కొంది. ఒక చేతికి కూడా శస్త్రచికిత్స జరగ్గా, అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్‌సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు. ఇజ్రాయెల్ తమను గుర్తించి దాడి చేయొచ్చనే భయంతో సీనియర్ అధికారులు కూడా ఆయన్ను కలవడం లేదని రిపోర్ట్ తెలిపింది. ఖమేనీకి కమ్యూనికేషన్ పరిమితం కావడంతో, దేశంలో అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి వెళ్లింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్లు ఇప్పుడు యుద్ధం, దౌత్యం, జాతీయ భద్రత వంటి కీలక అంశాలపై పూర్తి పట్టు సాధించారు. "మొజ్తబా ఒక బోర్డు డైరెక్టర్‌లా వ్యవహరిస్తుంటే, జనరల్స్ బోర్డు సభ్యులుగా మారి అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు" అని మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనెజాద్ సలహాదారు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ మార్పుతో దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వంటి పౌర నాయకులు కీలక నిర్ణయాల్లో నామమాత్రంగా మారారు. వారు కేవలం దేశీయ వ్యవహారాలకే పరిమితమయ్యారు. అమెరికా నావికా దిగ్బంధనం కొనసాగుతున్నప్పుడు చర్చలు వద్దని సైనిక కమాండర్లు వ్యతిరేకించడంతో, అమెరికాతో జరగాల్సిన చర్చలు కూడా విఫలమయ్యాయి. మొత్తంగా ఇరాన్‌లో పాలన మారనప్పటికీ, అధికారం ఒక వ్యక్తి చేతి నుంచి సైనిక కూటమి చేతికి బదిలీ అయిందని, వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని న్యూయార్క్ టైమ్స్ కథనం స్పష్టం చేసింది.

# అది రాజకీయ ప్రతీకారమే.. కోర్టు తీర్పు ప్రభుత్వానికి ఒక హెచ్చరిక: సబితా ఇంద్రారెడ్డి

**రైతుల కోసమే కేసీఆర్ కాళేశ్వరం నిర్మించారన్న సబిత**

**ప్రభుత్వం రాజకీయ ప్రతీకారంతో అక్రమ కేసులు పెడుతోందని విమర్శ**

**కాళేశ్వరం ప్రాజెక్టును బలహీనపరచాలని చూస్తోందని మండిపాటు**




కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఈ తీర్పును ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా అభివర్ణించారు. తాజాగా సబిత మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం రాజకీయ ప్రతీకారంతో, అధికార అహంకారంతో అక్రమ కేసులు పెడుతోందని, హైకోర్టు తీర్పుతో న్యాయం ఎటువైపు ఉందో స్పష్టమైందని ఆమె పేర్కొన్నారు. కేసీఆర్ తప్పు చేయలేదని ఈ తీర్పుతో రుజువైందని అన్నారు. రైతుల కోసమే కేసీఆర్ కాళేశ్వరం లాంటి మహా ప్రాజెక్టును నిర్మించారని, కానీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును బలహీనపరచాలని చూస్తోందని ఆరోపించారు. విపక్షాలపై చిల్లర కేసులు పెట్టడం మానుకుని, ప్రాజెక్టులో ఎక్కడైనా చిన్న చిన్న లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిచేసి రైతులకు నీరందించడంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# ట్రంప్‌కు ముంబైలోని ఇరాన్ ఎంబసీ వీడియోతో కౌంటర్

**ట్రంప్ ఒకసారి భారత్ వచ్చి చూడాలని సూచన**

**భారతదేశంలో అభివృద్ధి, సాంస్కృతిక విలువలు ట్రంప్‌కు తెలిసేలా వీడియో**

**మహారాష్ట్రలోని భవనాలు, సుందర ప్రదేశాలను షేర్ చేసిన ఎంబసీ**



చైనా, భారతదేశాలను నరకంతో పోలుస్తూ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ చేసిన వ్యాఖ్యల లేఖను రీపోస్ట్ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ముంబైలోని ఇరాన్ ఎంబసీ స్పందించింది. ట్రంప్ ఒకసారి భారత్ వచ్చి చూడాలని ఆ తర్వాత ఈ దేశం గురించి మాట్లాడాలని వ్యాఖ్యానించింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పోస్టు చేసింది. భారతదేశంలోని అభివృద్ధి, సాంస్కృతిక విలువలు ట్రంప్‌నకు తెలిసేలా ఎవరైనా ఆయనను భారతదేశ పర్యటనకు తీసుకువస్తే బాగుండేదని పోస్టులో పేర్కొంది. ఈ వీడియోలో మహారాష్ట్రలోని అత్యాధునిక సదుపాయాలు, సంప్రదాయ వేడుకలు, పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది. మహారాష్ట్రలోని అత్యంత ఎత్తైన భవంతులు, ఆధునిక రహదారులు, వినాయక నిమజ్జనంను ఈ వీడియోలో పొందుపరిచింది. ఇంకోవైపు, కొండలు, కోనలు, వాగులు, వంకలతో అద్భుతమైన సుందర ప్రదేశాలు ఉన్నాయని పేర్కొంది.

# వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించిన డీజీపీ శివధర్ రెడ్డి భక్తులకు పటిష్ట భద్రతకు ఆదేశాలు






**వేములవాడ, తెలంగాణ ఏప్రిల్ 24(పిడికిలి):** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామివారిని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని నియంత్రించడం, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ సదుపాయాలు, మహిళలు మరియు వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పోలీస్ అధికారులు, ఆలయ ఈవో మరియు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరైన పేద మహిళ నుంచి అక్రమ వసూళ్లు - అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరం



**సారంగాపూర్ ఏప్రిల్ 24 (పిడికిలి):** జగిత్యాల జిల్లా, సారంగాపూర్ మండలం, నగునూర్ గ్రామానికి చెందిన రేంగుంట గంగమ్మ (భర్త: రేంగుంట రాజు) అనే నిరుపేద మహిళకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఇల్లు లేని పేదలకు ఆసరాగా ప్రభుత్వం ఇచ్చే ఈ ఇంటిని పొందేందుకు సదరు మహిళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ కార్యదర్శి ఆరిఫొద్దీన్ అనే అధికారి, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత "ముగ్గు పోసిన ఫోటోలు అప్లోడ్ చేయాలి" అనే చిన్న పనికి రూ.5,0000 లంచం డిమాండ్ చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తున్నారు. అంతకుముందు కూడా, తన భర్త పేరు మీద ఉన్న కొద్దిపాటి స్థలాన్ని తన పేరు మీదకు మార్చుకోసం రూ.3,0000 లంచం తీసుకున్నట్లు గంగమ్మ వాపోయారు. మొత్తంగా ఒక పేద కుటుంబం నుంచి రూ.80000 అక్రమంగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. "ఉండటానికి దిక్కు లేకపోతేనే ప్రభుత్వం ఇల్లు ఇస్తుంది... ఆ ఇల్లు కోసం డబ్బులు అడిగితే మేమేం చేయాలి సార్?" అని గంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది డబ్బు సమస్య కాదు – చెమట, ఆకలి, బాధ, అవమానం అని ఆమె పేర్కొన్నారు. పేదరికంలో ఉన్నవారికే ఈ ఇండ్లు. అలాంటి వారి దగ్గరే లంచం అడిగితే, వారు ఎక్కడికి వెళ్లాలి? పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు అడ్డుకుంటూ, లంచాల కోసం వేధిస్తుండటం దారుణం.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు 10 వాహనాలు పట్టివేత





**రామచంద్రపురం, ఏప్రిల్ 24(పిడికిలి) :** రామచంద్రపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై రామ్ రెడ్డి, ఏఎస్ఐ రామస్వామి మరియు సిబ్బందితో కలిసి బంధంకొమ్ము రోడ్‌లోని మోర్ సూపర్ మార్కెట్ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మంది డ్రైవర్లను పోలీసులు పట్టుకుని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సిఐ విద్యాసాగర్ రెడ్డి సూచించారు

Editor, printed and owned by Timmagalla Srihari, Published at 16-11-542/1 Gaddiannaram, Dilsukhnagar, Hyderabad Telanganastate
Printed at karshakartprinters, Vidyanagar Hyderabad, Telanganastate, Chiefeditor: Chamakura Raju RNINo.ApTel14145/2004